నలభై ఏళ్ల కల సాకారం




తుది మెరుగులు దిద్దుకుంటున్న స్టాళ్లు

రూ.78 లక్షలతో రైతు బజార్ ఏర్పాటు | సీఎం జగన్ చొరవతో చురుగ్గా నిర్మాణం | హర్షం వ్యక్తం చేస్తున్న తగరపువలస వాసులు


సత్యనారాయణపేట కొండవాలు ప్రాంతంలో నిర్మించిన రైతుబజారు

తగరపువలస: తగరపువలస వాసుల 40 ఏళ్ల కల సాకారమైంది. ఇక్కడి ప్రజలు 1983 నుంచి ఆశగా ఎదురు చూసున్న రైతుబజారును వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నెరవేర్చింది. స్థానిక ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు చొరవతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూ.78 లక్షలు మంజూరు చేయడంతో చకచకా పనులు పూర్తయ్యాయి. భీమిలి నియోజకవర్గంలోని భీమిలి, ఆనందపురం, పద్మనాభం మండలాల్లో కూరగాయలు, ఆకుకూరలు, పువ్వులు విరివిగా సాగు చేస్తారు. కానీ వీటి విక్రయానికి సరైన ప్లాట్‌ఫాం లేకపోవడంతో రైతులు ఎక్కువగా విశాఖ నగరంలోని పలు ప్రాంతాలకు వీటిని తరలిస్తుంటారు. నియోజకవర్గంలోని తగరపువలస ప్రైవేట్ మార్కెట్ ముఖ్యంగా మారు బేరగాళ్ల చేతిలో బందీగా మారిపోయింది. రైతులు ఈ మార్కెట్‌కు తమ దిగుబడులు తీసుకొచ్చినా వ్యాపారులు వాటిని మార్కెట్‌లోకి అనుమతించకుండా నియంత్రిస్తుంటారు. దీంతో రైతులు రోడ్డుపైనే వసతులు లేనిచోట కూరగాయలు విక్రయిస్తుంటారు. మరికొందరు వ్యాపారులు ఇచ్చిన ధరకే కూరగాయలు, ఆకుకూరలు విక్రయించి ఉసూరుమంటూ వెళ్లిపోతుంటారు. రైతుబజారు అందుబాటులోకి వస్తే ప్రధాన రహదారిపై ట్రాఫిక్ సమస్య కూడా తీరుతుంది. విశాఖ, విజయనగరం, ఆనందపురం మార్కెట్లు, రైతు బజార్లతో పోలిస్తే తగరపువలస మార్కెట్‌లో కూరగాయలు కిలోకు రూ.10 నుంచి రూ.20 వరకు అదనంగా ఉంటాయి. ఈ పరిస్థితుల్లో గతంలో కాంగ్రెస్, టీడీపీ ప్రభుత్వాల ప్రతినిధులు ఎన్నికల హామీల్లో రైతుబజారు ఏర్పాటును ప్రధాన అంశంగా ప్రస్తావించినా నెరవేర్చలేదు.


ప్రధాన రహదారిపైనే కూరగాయల విక్రయం


తుది నిర్మాణంలో ప్రొవిజనల్ స్టోర్లు

రైతు బజారు ఆవశ్యకత గుర్తించిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం

తగరపువలసలో రైతుబజారు కోసం 40 ఏళ్లుగా ఇక్కడి ప్రజలు కంటున్న కలలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం గుర్తించింది. రూ.78 లక్షలతో జీవీఎంసీ రెండో వార్డు సత్యనారాయణపేటలో దీని నిర్మాణం కోసం 2021లో అప్పటి మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు భూమిపూజ చేశారు. ఈ ప్రాంతంలో రక్షణగోడ కూలిపోవడంతో రైతుబజారు నిర్మాణంలో కాస్త జాప్యం జరిగింది. ప్రస్తుతం తుది మెరుగులు దిద్దుకుంటున్న రైతు బజారు మరో 15 రోజుల్లో ప్రారంభానికి నోచుకోనుంది. ఇప్పటికే రైతులను కూడా గుర్తించినట్టు తెలిసింది. 47 కూరగాయల దుకాణాలు, 10 ప్రావిజనల్స్ స్టోర్లు, టాయిలెట్లు, ఆర్వో ప్లాంట్, స్టోర్ రూమ్, వాచ్‌మన్ కార్యాలయానికి గదులు నిర్మిస్తున్నారు.


నిర్మాణం పూర్తయిన మరుగుదొడ్లు

ఎదురు చూపులు ఫలించాయి



తగరపువలసలో రైతుబజారు ఏర్పాటు చేస్తారన్న ఆశలు చచ్చిపోయిన వేళ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చొరవతో 40 ఏళ్ల కల ఫలించింది. కూరగాయలు, ఆకుకూరలు చౌకగా అందుబాటులోకి రావడమే కాకుండా మెయిన్‌రోడ్డులో ట్రాఫిక్ సమస్య పరిష్కారం అవుతుంది.

– పెనుమాక జాన్ చార్లీ, చిట్టివలస

దళారీ వ్యవస్థకు కళ్లెం



నియోజకవర్గంలో కూరగాయలు, ఆకుకూరలు పండినా ధరలు మాత్రం అందుబాటులో ఉండేవి కాదు. ఇప్పుడు రైతుబజారు రాకతో తాజా కూరలతోపాటు ధరలు కూడా అందుబాటులోకి వస్తాయి. దళారీల బెడద వదులుతుంది.

– బోనిల వెంకట హరిబాబు, సంతపేట

అందరికీ మంచి రోజులు



రైతుబజారు నిర్మాణంతో రైతులకు గిట్టుబాటు ధరలు, వినియోగదారులకు సరసమైన ధరలకు ఆకుకూరలు, కూరగాయలు అందనున్నాయి. గతంలో అన్ని ప్రభుత్వాలు హామీలు మాత్రమే ఇవ్వగా సీఎం జగన్ ఇచ్చిన మాట ప్రకారం రైతు బజారును అందుబాటులోకి తీసుకొచ్చారు.

– అలుగోలు సంతోష్, తగరపువలస

వైభవంగా సామూహిక సత్యనారాయణ వ్రతాలు


వ్రతంలో పాల్గొన్న భక్తులు

భీమునిపట్నం: స్థానిక కృష్ణా కాలనీ కొండపైనున్న శ్రీ కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో బుధవారం సామూహిక సత్యనారాయణ వ్రతం ఆచరించారు. అర్చకులు అప్పలాచార్య ఆధ్వర్యంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు గాడు అప్పలనాయుడు, ఆలయ కమిటీ కార్యదర్శి డి.ఎస్.ఎస్.చంద్రమూర్తి, సత్యానందం, రేలంగి పెదబాబు, కె.ముత్యాలరావు, సన్నిబాబు, మొకర శంకర్ పాల్గొన్నారు.

వాహన చోదకులకు హెల్మెట్ తప్పనిసరి


విద్యార్థినులకు హెల్మెట్ ప్రాధాన్యతను వివరిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

పీఎం పాలెం : ద్విచక్ర వాహనాలపై ప్రయాణించే వారు విధిగా హెల్మెట్ ధరించాలని ట్రాఫిక్ ఏసీపీ జాన్ మనోహర్ సూచించారు. కారుషెడ్ కూడలిలో ట్రాఫిక్ నిబంధనలు, హెల్మెట్ ప్రాధాన్యంపై విద్యార్థులకు బుధవారం అవగాహన కల్పించారు. జాతీయ రహదారిపై హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తున్న వారికి విద్యార్థులు అవగాహన కల్పించారు. ప్రమాద సమయంలో ప్రాణాల రక్షణకు హెల్మెట్ కవచం వంటిదని సీఐ వెంకటరావు అన్నారు. జాతీయ రహదారిపై ద్విచక్ర వాహనాలపై ప్రయాణించే వారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్‌ఐ మురళీకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

రోడ్డు మరమ్మతులు ప్రారంభం


పనులు ప్రారంభిస్తున్న కార్పొరేటర్ కొండబాబు

కొమ్మాది: భీమిలి బీచ్‌రోడ్డు తిమ్మాపురం నుంచి మారికవలస వెళ్లే ప్రధాన రహదారికి మోక్షం లభించింది. పదేళ్లుగా ఈ రోడ్డు గుంతలమయం కావడంతో రాకపోకలు సాగించేవారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ఆదేశాల మేరకు రోడ్డుకు మోక్షం లభించింది. రూ.19 లక్షల వ్యయంతో మరమ్మతుల పనులు కార్పొరేటర్ దొలపల్లి కొండబాబు బుధవారం ప్రారంభించారు. కార్యక్రమంలో మేరుగు చిన్నారావు, మణి, అప్పలరాజు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

'గడప గడపకు మన ప్రభుత్వం' నేడు

పద్మనాభం: మండలంలోని మద్ది గ్రామంలో గురువారం 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించనున్నామని ఎంపీడీవో ఎం.విజయ్ కుమార్ తెలిపారు. సాయంత్రం నాలుగు గంటలకు ప్రారంభం కానున్న కార్యక్రమానికి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు హాజరు కానున్నారని ఆయన తెలిపారు.

గీతంలో ఎండీపీ శిక్షణ


కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న యూఎన్‌బీ రాజు

కొమ్మాది: ఔషధ పరిశ్రమ అరవిందో ఫార్మా లిమిటెడ్‌లో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులకు మేనేజ్‌మెంట్ డెవలప్‌మెంట్ కార్యక్రమం (ఎండీపీ) శిక్షణ బుధవారం గీతం వర్సిటీలో ప్రారంభమైంది. అరవిందో ఫార్మా మధ్య స్థాయి మేనేజర్లకు గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్ ప్రొఫెసర్లు వివిధ అంశాల్లో శిక్షణ ఇవ్వనున్నారు. సహ ఉద్యోగులతో కలిసి బృందంగా పని చేయడం, సమస్త ప్రగతిలో వ్యక్తిగత నైపుణ్యాలు ఉపయోగించడం వంటివి శిక్షణలో నేర్పుతారని అరవిందో ఫార్మా సీనియర్ ఉపాధ్యక్షుడు యూఎన్‌బీ రాజు వెల్లడించారు.

ఎస్‌కే రెడీమేడ్స్ యజమానికి రూ.20వేల సాయం


సంతోష్‌కుమార్‌కు నగదు అందిస్తున్న వీఎస్ఆర్ కుటుంబ సభ్యులు

తగరపువలస: గత ఆదివారం అగ్నిప్రమాదం కారణంగా మెయిన్‌రోడ్డులో దుకాణం కాలిపోయిన ఎస్‌కే రెడీమేడ్స్ యజమాని వెంపాడ సంతోష్‌కుమార్‌కు వీఎస్ఆర్ కుటుంబ సభ్యులు బుధవారం రూ.20 వేల సాయం అందించారు. ఈ ప్రమాదంలో దుకాణ యజమానికి రూ.7 లక్షలు నష్టం వాటిల్లిన సంగతి తెలిసిందే. డీసీఆర్ శేఖర్, ఎంఎఫ్‌సీ అధినేత ఆదిమూలం నాగరాజు, అక్కరమాని చినబాబు, సాయి శిరీష మెడికల్ వెంకట్, బాల, కిరణ్ రూ.1000 వంతున మిగిలిన రూ.14వేలు వెంపాడ వెల్ఫేర్, వీఎస్ఆర్ కుటుంబ సభ్యులు సమకూర్చారు. ఈ మొత్తాన్ని డీసీఆర్ శేఖర్ చేతుల మీదుగా బాధితునికి అందించారు. కార్యక్రమంలో వెంపాడ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు వెంపాడ శ్రీనివాసరెడ్డి, అంబేడ్కర్ స్కూల్ కమిటీ చైర్మన్ దామిశెట్టి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

సీఎస్‌సీతో అవంతి ఫార్మసీ కళాశాల ఒప్పందం

తగరపువలస: చెరకుపల్లి అవంతి ఫార్మసీ కళాశాల యాజమాన్యం బుధవారం సీఎస్‌సీతో అవగాహన ఒప్పందం చేసుకుంది. ఎలక్ట్రానిక్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీపై భారతరంగ సంస్థ సీఎస్‌సీ అకాడమీతో అవగాహన కుదుర్చుకున్నట్టు కళాశాల ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎంబీవీ రాజు, వైస్ ప్రిన్సిపాల్ వి.ఉమాశంకర్, డైరెక్టర్ ఆకుల చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలతో గిట్టుబాటు ధర


బోనిలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

ఆనందపురం : ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా రైతులు పండించిన ప్రతీ గింజను కొనుగోలు చేస్తామని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు చెప్పారు. మండలంలోని బోనిలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ గతంలో రైతులు పండించిన ధాన్యానికి సరైన గిట్టుబాటు ధర లేక తీవ్రంగా నష్ట పోయేవారన్నారు. వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత రైతు భరోసా కేంద్రాల్లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారని చెప్పారు. వాటి ద్వారా మోసాలకు తావులేకుండా గిట్టుబాటు ధర కల్పించి స్థానికంగానే ధాన్యాన్ని కొనుగోలు చేయడంతో రైతులకు ఎంతో ఉపయోగకరంగా మారిందన్నారు. రైతుల సౌకర్యార్థం భీమిలి నియోజకవర్గంలో 9 కేంద్రాలు ఏర్పాటు చేశామని వివరించారు. వీటి ద్వారా ఏడు వేల టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని చెప్పారు. బోని, శిర్లపాలెం గ్రామాల్లోని ఇనాం భూములపై రైతులకు సర్వహక్కులు కల్పించడానికి నిర్ణయించి ప్రభుత్వం సర్వే చేయించిందని, త్వరలోనే పట్టాలు అందజేస్తామని వివరించారు. పౌర సరఫరాల శాఖ జిల్లా మేనేజర్ రాజేశ్వరి మాట్లాడుతూ రైతులు ధాన్యం శాంపిళ్లను రైతు భరోసా కేంద్రాలకు అందజేయాలన్నారు. అక్కడ సిబ్బంది నాణ్యతా ప్రమాణాలు పరిశీలించి గ్రేడ్ – ఎ రకం క్వింటాకు రూ.2,203లు, కామన్ రకానికి క్వింటాకు రూ.2183లు చొప్పున ధర అందిస్తారని చెప్పారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ బోని అప్పలకొండ, భీమిలి వ్యవసాయ శాఖ ఏడీ బి.విజయ్ ప్రసాద్, తహసీల్దార్ లోకవరపు రామారావు, మార్కెట్ కమిటీ చైర్మన్ ఎలమంచిలి సూర్యనారాయణ, వైస్ చైర్మన్ బోని అప్పలనాయుడు, ఆనందపురం సహకార సంఘం అధ్యక్షుడు పొంద్రింకి అప్పారావు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు బంక సత్యం, రైతు సంఘం అధ్యక్షుడు అన్నమయ్య, వ్యవసాయాధికారులు సంధ్యారత్న ప్రభ, శివ కోమలి, చలం, బోని సన్యాసినాయుడు, రౌతు వెంకటరావు, రౌతు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

అభ్యసన సామర్థ్యాలు అంచనా వేయాలి


ఉపాధ్యాయులకు సూచనలిస్తున్న డీఈవో చంద్రకళ

ఆనందపురం : విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు ఎప్పటికప్పుడు అంచనా వేయాలని డీఈవో చంద్రకళ సూచించారు. స్థానిక ఉన్నత పాఠశాలలో ఆనందపురం, పద్మనాభం మండలాలకు చెందిన ప్రభుత్వ పాఠశాలల గణిత ఉపాధ్యాయులకు రెండు రోజులపాటు నిర్వహిస్తున్న శిక్షణను బుధవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి విద్యార్థికి చతుర్విధ ప్రక్రియలతోపాటు, చదవడం, రాయడం రావాలన్నారు. గణిత పరంగా ప్రతి అధ్యాయం ముగిసిన వెంటనే విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించి రికార్డులు నిర్వహించాలన్నారు. లిప్ పద్ధతి ఆధారంగా పాఠ్య బోధన జరగాలని, సందర్శన అధికారులు వచ్చినప్పుడు పరిశీలన నిమిత్తం వాటిని భద్రపరచాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈవో – 2 గంగరాజు, హెచ్‌ఎం శ్రీనివాసరావు, రిసోర్స్ పర్సన్ కేజియా, సీఆర్‌పీ శివాజీ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్పస్వామి పడిపూజ


అయ్యప్పస్వామి పూజలో ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు దంపతులు

తగరపువలస: చెరకుపల్లి అవంతి ఇంజినీరింగ్ కళాశాల ఆడిటోరియంలో బుధవారం అయ్యప్ప స్వామి పడిపూజ ఘనంగా నిర్వహించారు. గాజువాకకు చెందిన ముంగిపూడి కామేశ్వరశర్మ, కేరళకు చెందిన ప్రవీణ్‌కుమార్ నంబూద్రి, కళాశాల అర్చకుడు పెంట వెంకటరమణ శర్మ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే, అవంతి విద్యాసంస్థల చైర్మన్ ముత్తంశెట్టి శ్రీనివాసరావు సతీసమేతంగా పూజలో పాల్గొన్నారు. పంచామృతాలతో అయ్యప్ప స్వామిని అభిషేకించారు. అష్టోత్తరాలు, భీమిలికి చెందిన శ్రీనివాస్ బృందం భక్తిగీతాలతో స్వాములు ఓలలాడారు. అయ్యప్పస్వామి శరణు ఘోషతో ఈ ప్రాంతం మార్మోగింది. అనంతరం ఆవరణలో మహానారాయణసేవ నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రీజినల్ యూత్ కోఆర్డినేటర్ ముత్తంశెట్టి శివనందీష్, జీవీఎంసీ చీఫ్ విప్ డాక్టర్ ముత్తంశెట్టి ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

'రెడ్డికలకు మైగ్రేషన్ సర్టిఫికెట్లు ఇప్పించండి'


విజయనగరం కలెక్టర్ నాగలక్ష్మికి వినతిపత్రం అందిస్తున్న రెడ్డిక కార్పొరేషన్ డైరెక్టర్లు అప్పలరెడ్డి, భాస్కరరెడ్డి

తగరపువలస: విజయనగరం జిల్లా నుంచి ఉపాధి నిమిత్తం విశాఖ తదితర జిల్లాలకు వలస వెళ్లిన రెడ్డిక సామాజిక వర్గ ప్రజలకు మైగ్రేషన్ సర్టిఫికెట్లు ఇప్పించాలని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మిని కోరుతూ రెడ్డిక కార్పొరేషన్ డైరెక్టర్లు శీరపు అప్పలరెడ్డి, రౌతు భాస్కరరెడ్డి వినతిపత్రం అందించారు. బుధవారం విజయనగరం కలెక్టరేట్‌లో ఆమెను వీరు కలిశారు. ఈ సందర్భంగా వారు తగరపువలసలో మాట్లాడుతూ రెడ్డిక సామాజిక వర్గ ప్రజలు ఉపాధి నిమిత్తం జిల్లా మారినప్పుడు మాతృ జిల్లాలో చలామణిలో ఉన్న సామాజికవర్గమే వర్తింపచేయాలని కోరామన్నారు. అలాగే విజయనగరం టౌన్ తహసీల్దార్ కోరాడ శ్రీనివాసరావుకు కూడా వినతిపత్రం అందించామన్నారు.

మనస్తాపంతో యువకుడి ఆత్మహత్య

తగరపువలస: జీవీఎంసీ రెండో వార్డు వలందపేటకు చెందిన కోనాడ పోలిరాజు అనే టైల్స్ కార్మికుడు మనస్తాపంతో బుధవారం ఉదయం ఇంట్లో చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఇతనికి మూడేళ్ల క్రితం రామలక్ష్మితో వివాహం కాగా ఒక కుమార్తె ఉంది. ఇటీవల మద్యానికి బానిసై భార్యను వేధిస్తుండటంతో ఆమె పుట్టింటికి వెళ్లిపోయింది. పోలిరాజు ఆమె వద్దకు వెళ్లి ఇంటికి రావాలని కోరగా... మద్యం మానితే వస్తానని చెప్పడంతో తిరిగి ఇంటికి వచ్చేశాడు. ఈ క్రమంలో తల్లి అప్పయ్యమ్మ నగరంలోని పెద్ద కుమారుడు ఇంటికి బుధవారం వెళ్లడంతో... ఇంటిలో ఒంటరిగా ఉన్న పోలిరాజు ఈ అఘాయిత్యానికి పాల్పడ్డాడు. మృతుని తల్లి భీమిలి పోలీసులకు ఫిర్యాదు చేస్తూ మనస్తాపంతో ఆత్మహత్యకు పాల్పడినట్టు తెలిపింది. ఎస్‌ఐ గంటా హరీష్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.


మానవ తప్పిదాల వల్లే ప్రమాదాలు


వర్తక సంఘ సమావేశంలో ఎమ్మెల్యే శ్రీనివాసరావు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

తగరపువలస: మానవ తప్పిదాల వల్లే ప్రమాదాలు జరుగుతుంటాయని, వాటి నుంచి తప్పించుకోవడానికి వివిధ ప్రభుత్వ విభాగాల అధికారులు చిత్తశుద్ధితో వ్యవహరించాలని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు సూచించారు. ఇటీవల జస్వంత్ రెడీమేడ్ షాపులో ప్రమాదం నేపథ్యంలో బుధవారం సాయంత్రం చిట్టివలస శ్రీలక్ష్మీశ్రీనివాస కల్యాణమండపంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వర్తకసంఘం, జీవీఎంసీ, అగ్నిమాపక, టౌన్ ప్లానింగ్, రెవెన్యూ, ఆరోగ్య, విద్యుత్‌శాఖ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీనివాసరావు మాట్లాడుతూ చట్టానికి ఎవరూ అతీతులు కాదన్నారు. వ్యాపారులు ఖచ్చితంగా పాటించాల్సిన నిబంధనలు అమలయ్యేలా అధికారులు చూడాలన్నారు. ప్రమాదంలో నష్టపోయిన కటకం సునీత, వెంపాడ సంతోష్‌కు ప్రభుత్వం నుంచి గరిష్ఠంగా సాయం అందించేందుకు కృషి చేస్తానన్నారు. జిల్లా అగ్నిమాపక శాఖాధికారి రేణుకయ్య మాట్లాడుతూ వ్యాపారాలు, నివాసం ఒకే భవంతిలో ఉండకూడదన్నారు. ఇప్పటికే పాత భవనాలు ఉంటే వెంటిలేషన్, కొత్త భవనాలు నిర్మిస్తుంటే విశాలమైన ప్రదేశం ఉంచాలన్నారు. విశాఖ, విజయనగరం, అనకాపల్లి జిల్లాలకు చెందిన 8 అగ్నిమాపక శకటాలు మంటలు ఆర్పినందున మూడు జిల్లాల అధికారులు సమన్వయంతో నష్టం అంచనా వేయనున్నట్టు తెలిపారు. మధురవాడ జోన్ ఏసీపీ శివరామిరెడ్డి మాట్లాడుతూ ప్రమాదం జరిగిన ప్రాంతంలో స్థానిక యువత వల్ల సహాయక చర్యలకు అంతరాయం కలిగిందన్నారు. ఈ సందర్భంగా అగ్నిప్రమాదాన్ని నియంత్రించేందుకు శ్రమించిన పోలీస్, అగ్నిమాపక, రెవెన్యూ, జీవీఎంసీ అధికారులను సన్మానించారు. జీవీఎంసీ అదనపు కమిషనర్ సన్యాసిరావు, విద్యుత్ ఈఈ శ్రీనివాస్, సీఎంహెచ్‌వో నరేష్, జీవీఎంసీ ఫైర్ అధికారి హనుమంతరావు, ఆర్డీవో ఎస్.భాస్కరరెడ్డి, జెడ్సీ బి.రాము, సీఐ డి.రమేష్, వర్తక సంఘం అధ్యక్షుడు దుర్గా మురళి, దుర్గా రామకోటి, కార్పొరేటర్ దొలపల్లి ఏడుకొండలు, పీఏసీఎస్ అధ్యక్షుడు అక్కరమాని రామునాయుడు, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి జీరు వెంకటరెడ్డి, కొప్పల రమేష్ పాల్గొన్నారు.

పథకాల అమలు సీఎం జగన్‌తోనే సాధ్యం


మధురవాడలో వైఎస్సార్ సీపీ పతాకావిష్కరణ


వుడా కాలనీలో బ్యాగులు, పార్టీ ప్రచార సామగ్రి పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ అప్పారావు

మధురవాడ: సంక్షేమ పథకాలు, ప్రజా సంక్షేమ పాలన కొనసాగాలంటే సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డినే మరోసారి ముఖ్యమంత్రిని చేసుకోవాలని పలువురు నాయకులు అన్నారు. 'ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే' కార్యక్రమంలో భాగంగా జీవీఎంసీ 5, 6, 7, 8 వార్డుల్లో సంక్షేమ పథకాలు ఫ్లెక్సీలు, వైఎస్సార్‌సీపీ జెండాలు బుధవారం ఆవిష్కరించారు. జీవీఎంసీ 6వ వార్డు రిక్షా కాలనీలో నిర్వహించిన కార్యక్రమంలో పార్టీ వార్డు అధ్యక్షుడు బొట్ట అప్పలరాజు, గౌరవ అధ్యక్షుడు డాక్టర్ గాదే రోశిరెడ్డి, యర్ర జోగారావు, సూరిబాబు, కొండమ్మ పాల్గొన్నారు.

- జీవీఎంసీ 8వ వార్డు మిథిలాపురి వుడా కాలనీ 54వ నంబరు సచివాలయం వద్ద కార్పొరేటర్ లొడగల అప్పారావు, పార్టీ వార్డు అధ్యక్షుడు గుడ్ల పోలిరెడ్డి పతాకావిష్కరణ చేసి, పథకాల ఫ్లెక్సీ ఆవిష్కరించారు. కన్వీనర్లు రమణమూర్తి, చంటి, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.
- జీవీఎంసీ 7వ వార్డు 56వ నంబరు సచివాలయం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో పార్టీ వార్డు అధ్యక్షుడు పోతిన శ్రీనివాసరావు జెండా ఆవిష్కరించారు. సంక్షేమ పథకాల ఫ్లెక్సీని పిళ్లా సూరిబాబు, పీకేఎమ్ పాత్రుడు ఆవిష్కరించారు. కన్వీనర్లు వెంకటరావు, శ్రీదేవి, శేషుబాబు, బంగారు ప్రకాశ్, అప్పన్న, బ్రిక్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సిమెంట్ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన


సిమెంట్ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్ అచ్చియ్యమ్మ తదితరులు

ఆనందపురం : మండలంలోని పాలవలస పంచాయతీ మెట్టమీదపాలెం, దిగువ పాలవలస పరిధిలో రెండు చోట్ల సిమెంట్ రోడ్ల నిర్మాణానికి బుధవారం స్థానిక సర్పంచ్ నాగోతు అచ్చియ్యమ్మ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామంలో రోడ్ల సమస్యను ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు దృష్టికి తీసుకెళ్లగా... ఓ సీఫుడ్ కంపెనీ యాజమాన్యంతో మాట్లాడి వారి సామాజిక సేవా కార్యక్రమంలో భాగంగా నిధులు సమీకరించి రోడ్ల నిర్మాణానికి ఏర్పాట్లు చేశారని చెప్పారు. దీంతో ఎప్పటి నుంచో ఉన్న సమస్య పరిష్కారం కావడంతో ఆమె గ్రామస్తుల తరఫున ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు చెప్పారు. కార్యక్రమంలో కంపెనీ సీఈవో రామకృష్ణ, నాయకులు మజ్జి వెంకటరావు, బంక సత్యం, నాగోతు నరిశమ్మ, రౌతు వెంకటరావు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ రౌతు శ్రీను, నాగోతు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

'5న కలెక్టరేట్‌లో విచారణకు హాజరు కావాలి'

తగరపువలస: భీమిలి మండలం కాపులుప్పాడ సర్వే నంబర్ 371/1 లోని 4.50 ఎకరాల భూమికి సంబంధించి విచారణ నిమిత్తం కలెక్టరేట్‌లో డిసెంబరు 5న పత్రాలతో విచారణకు హాజరు కావాలని కార్యాలయ ప్రతినిధి కె.మోహన్‌కుమార్ సూచించారు. నగరంలోని శ్రీనగర్ సూర్యక్రాంతి రెసిడెన్సీలోని గ్రౌండ్ ఫ్లోర్ 101ఎలో నివసిస్తున్న జె.రామారావు ఈ భూమికి సంబంధించి హైకోర్టులో 28603/2015 రిట్ పిటీషన్ దాఖలు చేశారన్నారు. హైకోర్టు 2022 నవంబరు 30న జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం కలెక్టర్ వద్ద విచారణ నిమిత్తం పలుమార్లు నోటీసులు జారీ చేశారన్నారు. చివరిసారిగా 5న విచారణకు హాజరుకాకపోతే కార్యాలయంలో అందుబాటులో ఉన్న ఆధారాలు, క్షేత్రస్థాయిలో నివేదికల ఆధారంగా చర్యలు తీసుకోనున్నట్టు తెలిపారు.